క్లుప్తంగా

బోధనేతర పనులు వద్దు

మైలవరం: ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించవద్దని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి పాండురంగ వరప్రసాద్ అన్నారు. మైలవరంలో గురువారం ఫెడరేషన్ సభ్యత్వ నమోదు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించడం వలన బోధనా సమయం తగ్గిపోతోందని, దీనివలన విద్యార్థులకు ఎక్కువ సమయం కేటాయించలేకపోతున్నారని చెప్పారు. యాప్‌లు, ఆన్‌లైన్ కార్యక్రమాలు బాగా పెంచారని, ఇది విద్యారంగాన్ని తీవ్రంగా నష్టపరుస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి భూక్యా వసరం, కె. శ్రీనివాసరావు, షేక్ అబ్దుల్ ఖాదర్ పాల్గొన్నారు.

పాడి రైతులకు బోనస్ పంపిణీ



లక్ష్మీపురం(తిరువూరురూరల్): తిరువూరు క్లస్టర్ పరిధిలోని పాల ఉత్పత్తిదారులకు కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు గురువారం బోనస్ పంపిణీ చేశారు. లక్ష్మీపురం పాలశీతల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో 2025-26లో మొదటి విడత పాల ధర వ్యత్యాసం సొమ్మును 177 గ్రామాల్లోని రైతులకు రూ.కోటీ 76 లక్షలు చెక్కుల రూపంలో అందజేశారు. జిల్లా పాలకవర్గ సభ్యులు బి. రామచంద్రరావు, ట్రస్ట్ సభ్యులు ముక్కుమాల విజయలక్ష్మి, ఫీడ్ కమిటీ సభ్యులు సూరయ్య, గద్దె రంగారావు, బోయపాటి సుశీల, లక్ష్మీపురం పాలశీతల కేంద్రం మేనేజరు దిలీప్, అసిస్టెంట్ మేనేజర్లు పాల్గొన్నారు.

హైస్కూల్‌లో హర్‌ఘర్ తిరంగా

నూజివీడు: మండలంలోని అన్నవరం హైస్కూల్‌లో గురువారం హర్‌ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాల గోడలపై త్రివర్ణ పతాకాన్ని చిత్రీకరించారు. విద్యార్థులకు త్రివర్ణ పతాకాన్ని అందజేసి ప్రతి ఇంట్లో జాతీయ పతాకం ఎగరాలని హెచ్‌ఎం జి. విజయకుమారి పేర్కొన్నారు. ప్రతి ఇంటిపైనా, ప్రతి ఒక్కరి గుండెల్లో త్రివర్ణ పతాకం రెపరెపలాడాలన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో త్యాగాలు చేసిన జాతీయ నాయకులను స్మరించుకోవాలని చెప్పారు. పీడీ పి. రవీంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దివ్యాంగునికి కృత్రిమ కాళ్లు అందజేత



ఆగిరిపల్లి: దాతల ఆర్థిక సహాయంతో దివ్యాంగునికి కృత్రిమ కాళ్లను అందజేశారు. గురువారం మండలంలోని తోటపల్లి హీల్ కృత్రిమ అవయవ కేంద్రంలో ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయిన శివప్రసాద్‌కు దాత మొవ్వ శారద ఆర్థిక సాయంతో కృత్రిమ కాళ్లను అందజేశారు.

ఫ్యాన్లు, బుక్స్ వితరణ

మూలపాడు(ఇబ్రహీంపట్నం): గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని షేక్ జైరున్ పాఠశాలలో చదువుతున్న 50 మంది విద్యార్థినీ విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్ కాపీ రైటింగ్, నోట్‌బుక్స్, రెండు సీలింగ్ ఫ్యాన్లను గురువారం అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్‌ఏ ప్రసాద్, పలువురు ఉపాధ్యాయులు షేక్ జైరున్‌కు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నళిని, లక్ష్మీ, పేరెంట్స్ కమిటీ చైర్మన్, పి.శ్యామల, బీబీసీ ట్రస్టు చైర్మన్, ఎండి, అమీర్ జానీ పాల్గొన్నారు.

లబ్ధిదారులకు నిధులు జమ

ఆగిరిపల్లి: మండలంలోని 2014-19 మధ్య గృహ నిర్మాణాల పెండింగ్ బకాయిల నిధులు లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయ్యాయని హౌసింగ్ ఏఈ కాండ్రు సుందర్ కుమార్ తెలిపారు. 2014-19 సంవత్సరంలో ఎన్టీఆర్ రూరల్ హౌసింగ్ పథకం ద్వారా 402 మంది లబ్ధిదారుల పెండింగ్ బకాయిలు కోటి ముప్పై రెండు లక్షల పదహారు వేల ఎనిమిది వందల పదహారు రూపాయలు లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయ్యాయని వివరించారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు శిక్షణ

విస్సన్నపేట: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఉపాధి హామీ పథకం కూలీలకు ముఖ ఆధారిత హాజరు తప్పక రెండు పూటలు తీయాలని, చేసిన పనులు మరలా చేయకుండా జియో ఫెన్సింగ్ చేయడం, అమృత సరోవర్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. విస్సన్నపేట, రెడ్డిగూడెం మండలాల ఫీల్డ్ అసిస్టెంట్లు, విజయవాడ ఏపీడీ వెంకటేశ్వరరావు, డ్వామా కార్యాలయం ఈసీ కె. సతీష్‌చంద్ర, ఏపీఓ రామారావు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

మైలవరం: మైలవరంలో హెచ్‌ఐవీ ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల కుటుంబాల పిల్లల విద్య నిమిత్తం విజయవాడ సర్వీస్ స్వచ్ఛంద సేవా సంస్థ రూ. లక్ష ఆర్థిక సహాయం అందజేసింది. మూడో తరగతి నుంచి ఇంటర్ చదువుకునే పిల్లలు 20 మందికి గాను చెక్కు ద్వారా ఆర్థిక సహాయం అందించారు. డైరెక్టర్ మల్లెల అనిల్‌కుమార్, వి. రమేష్‌బాబు, జి. డేవిడ్, డి. రవీంద్రప్రసాద్, కంకట మేరీ పాల్గొన్నారు.

రోడ్లపైనే మాంసం విక్రయాలు

- పారిశుద్ధ్య సమస్యతో ఇబ్బందులు
- మార్కెట్ లేక పోవడంతో దుస్థితి
- పదేళ్లుగా ఊరిస్తున్న మార్కెట్ నిర్మాణం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలో మటన్ మార్కెట్ లేకపోవడంతో రోడ్లపైనే వివిధ రకాల మాంసం, చేపల విక్రయాలు జరుపుతున్నారు. వ్యాపారుల నిర్వాకంతో పారిశుద్ధ్య సమస్య తలెత్తుతోంది. ప్రధాన రోడ్ల వెంట ఏర్పాటు చేసిన విక్రయ దుకాణాల వలన ట్రాఫిక్ సమస్య సైతం ఉత్పన్నమవుతోంది. కనీస నిబంధనలు పాటించకుండా యథేచ్ఛగా మాంసం విక్రయాలు సాగిస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. పట్టణంలోని ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్, పోలీస్‌స్టేషన్ రోడ్డు, ఫెర్రీ రోడ్డు తదితర ప్రాంతాల మాంసం విక్రయ కేంద్రాల్లో ప్రతి రోజూ మాసం, చేపలు విక్రయాలు జరుగుతున్నాయి. పదేళ్లుగా మటన్ మార్కెట్ కల సాకారం కావడం లేదు.



కొండపల్లిలో గతంలో ఏర్పాటు చేసిన మటన్ మార్కెట్ సముదాయం



ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్‌లో జనసంచారం వద్ద మాంసం విక్రయ దుకాణం

పదేళ్ల కిందటే మార్కెట్ నిర్మాణానికి సన్నాహాలు

ఇబ్రహీంపట్నం గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలోనే మాంసం విక్రయదారులకు అనుకూలంగా మటన్ మార్కెట్ నిర్మాణం జరిపేందుకు అధికారులు సన్నాహాలు చేశారు. పారిశుద్ధ్య సమస్యలను దృష్టిలో ఉంచుకుని ప్రధాన రహదారులు, జనసంచారం లేని ప్రాంతాల్లో స్థలాల పరిశీలన చేశారు. కొన్ని స్థలాలు అనుకూలంగా ఉన్నాయని గుర్తించారు. అయితే మార్కెట్ నిర్మాణానికి అడుగులు ముందుకు పడలేదు. ఈ పరిణామాలతో ఎవరికి ఇష్టమొచ్చినట్లు వారు జనసంచార ప్రాంతాలు, ప్రధాన రోడ్ల వెంట మాంసం విక్రయ దుకాణాలు ఏర్పాటు చేసుకుని అమ్మకాలు జరుపుతున్నారు. మాంసం దుకాణాలతో ప్రజలు ఇబ్బందిపడుతున్నా సంబంధిత అధికారులు మార్కెట్ నిర్మాణాన్ని పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

యథేచ్ఛగా అమ్మకాలు

ఇబ్రహీంపట్నం వాయు, బూడిద కాలుష్యానికి నిలయంగా ఉంది. వాహన కాలుష్యం, దుమ్ము, ధూళితో నిండిన రింగ్ సెంటర్‌లో యథేచ్ఛగా మాంసం విక్రయాలు జరుగుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు పక్కన మాంసాన్ని విక్రయించడం వలన వాటిపై దుమ్ము, ధూళి, ఈగలు వాలుతుండటంతో వాటిని కొనుగోలు చేసిన వారు రోగాల బారిన పడుతున్నారు. కొండపల్లిలో ప్రత్యేకంగా మటన్ మార్కెట్ ఏర్పాటు చేశారు. దీనికి చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేశారు. ప్రజలకు ఇబ్బంది కలుగకుండా దుకాణాలు నిర్వహిస్తున్నారు. ఇబ్రహీంపట్నంలో మార్కెట్ నిర్మాణం కలగా మారింది. మున్సిపల్ పాలకవర్గం ఈసారైనా మార్కెట్ నిర్మించాలని కోరుతున్నారు.

మాంసం విక్రయాల్లో నిబంధనలు గాలికి..

మాంసం మార్కెట్ లేకపోవడంతో ఇష్టమొచ్చినట్లు వ్యాపారాలు సాగిస్తున్నారు. నిబంధనల మేరకు పొట్టేళ్లు, గొర్రెలు, మేకపోతులు పూర్తిగా ఆరోగ్యకరమైనవిగా పశు వైద్యాధికారులు నిర్ణయించాలి. పొట్టేళ్లు తదితరాలు కోసిన అనంతరం మాంసం నాణ్యతను పశు వైద్యులు పరిశీలించాల్సి ఉంది. విక్రయ ప్రదేశాలు పరిశుభ్రంగా ఉండాలి. ఈగలు, దోమలు, ఇతర క్రిమి కీటకాలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. మాంసం కోసే వ్యక్తికి గాయాలు ఉండకుండా ఆరోగ్యంగా ఉండాలి. యాప్రాన్ ధరించి చేతికి గ్లౌజులు వేసుకోవాలి. ప్రత్యేకంగా కేటాయించిన స్థలంలోనే మాంసం విక్రయాలు జరపాలి. ఇవేమీ ఇక్కడ పాటించడం లేదు. మార్కెట్ ఉంటేనే ఇవన్నీ జరిగే అవకాశం ఉంది.

మటన్ మార్కెట్ ఏర్పాటు చేయాలి



మాంసం విక్రయదారులు ఎన్నో ఏళ్లుగా మటన్ మార్కెట్ కోసం ఎదురు చూస్తున్నారు. మార్కెట్ వలన మున్సిపాల్టీకి ఆదాయం పెరుగుతుంది. గతంలో నిర్మాణం చేసేందుకు ముందుకొచ్చినప్పటికీ సాకారం కాలేదు. ప్రస్తుత మున్సిపల్ పాలకవర్గం అయినా మటన్ మార్కెట్ కలను సాకారం చేయాలి.

– ఎ.విఠల్‌రావు, ఇబ్రహీంపట్నం

పరిశుభ్రత పాటించాలి



ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మాంసం విక్రయదారులు నిబంధనలతో పాటు పరిశుభ్రత పాటించాలి. ఆరోగ్యకరమైన జీవాలను మాత్రమే కోయాలి. మాంసం వ్యర్థాలు ఎక్కడ పడితే అక్కడ వేయకుండా మున్సిపాల్టీ వారు సూచించిన ప్రాంతాల్లో మాత్రమే వేయాలి. మార్కెట్ నిర్మాణం జరిగితే సమస్యలకు పరిష్కారం లభిస్తుంది.

– కె.శ్రీనివాసరావు, ఇబ్రహీంపట్నం

కార్యకర్తల కుటుంబాలకు ప్రతాప్ అప్పారావు పరామర్శ

ఆగిరిపల్లి: వైఎస్సార్ సీపీ నాయకుడు రెడ్డి వెంకటనారాయణ తండ్రి ఇటీవల మరణించాడు. ఆయన కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు గురువారం పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ కార్యకర్త బండారు శేషు అనారోగ్యంతో ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. విజయవాడ ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చిన ఆగిరిపల్లి మండల సోషల్ మీడియా కో-కన్వీనర్ పచ్చిగళ్ల అజయ్ కుమార్‌ను పరామర్శించి, ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైఎస్సార్ సీపీ నాయకుడు దుప్పల వెంకయ్య మనవడు జన్మదినం సందర్భంగా చిన్నారిని ఆశీర్వదించారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ ఆగిరిపల్లి మండల అధ్యక్షుడు బెజవాడ రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు పల్లగాని నరసింహారావు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ మద్దా హరిబాబు, జెడ్పీటీసీ పిన్నిబోయిన వీరబాబు, ఎంపీటీసీ సాదం గోపీనాథ్, నాగుల్ మీరా, వివిధ విభాగాల నాయకులు నక్కన బోయిన శ్రీమన్నారాయణ, వాక సత్యేశ్వరరావు, గుండ్ల హనుమంతరావు, కంబాల ప్రదీప్, చిమట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నిందితుల కోసం ముమ్మరంగా గాలింపు

ఇబ్రహీంపట్నం: స్థానిక పోలీస్ స్టేషన్‌లో పలు కేసుల్లో నిందితులుగా ఉండి కోర్టుకు హాజరుకాని వారి కోసం గాలింపు చర్యలు చేపట్టామని సీఐ చంద్రశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అమీర్‌పేటకు చెందిన నూకారపు ధర్మతేజ, పశ్చిమ ఇబ్రహీంపట్నంకు చెందిన సితారే, ఇదే ప్రాంతానికి చెందిన హస్‌నైని, అజిత్‌సింగ్‌నగర్‌కు చెంది వెస్ట్ ఇబ్రహీంపట్నంలో ఉండే సురేష్‌బాబు వివిధ కేసుల్లో ముద్దాయిలుగా ఉన్నారని చెప్పారు. వీరందరు విజయవాడ నాలుగో ఏజేఎంఎఫ్‌సీ కోర్టుకు కొంతకాలంగా హాజరు కావడం లేదన్నారు. కోర్టు వీరందరినీ పరారీలో ఉన్న నేరస్తులుగా ప్రకటించి 82 సీఆర్‌పీసీ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. వీరందరూ ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో గానీ, కోర్టులో గానీ నెల రోజుల లోపు లొంగిపోవాలని చెప్పారు. ఈలోపు గాలింపు చర్యలు కొనసాగుతాయన్నారు.

టీడీపీ దాడులు హేయం

వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి స్వామిదాసు

తిరువూరు: పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో అడ్డదారిలో గెలుపు కోసం వైఎస్సార్ సీపీ నాయకులపై టీడీపీ దాడులకు పాల్పడటం హేయమని వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. తిరువూరులో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పులివెందులలో దీర్ఘకాలంగా వైఎస్సార్ కుటుంబం చేస్తున్న సేవలతో అక్కడి ప్రజల మదిలో నిలిచిపోయారని, అక్కడ గెలుపు సాధ్యం కాదని భావించిన టీడీపీ నాయకులు దౌర్జన్యాలకు పాల్పడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని విమర్శించారు. జెడ్పీటీసీ ఉప ఎన్నిక కోసం టీడీపీ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు అధిక సంఖ్యలో పులివెందులలో మకాం వేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. పోలీసు యంత్రాంగాన్ని అడ్డు పెట్టుకుని, గూండాగిరితో జెడ్పీటీసీ పదవి దక్కించుకోవాలని టీడీపీ చేస్తున్న ప్రయత్నాలను అక్కడి ప్రజలు తిప్పి కొట్టడం ఖాయమన్నారు. తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఇక్కడ గంజాయి, అక్రమ ఇసుక, మట్టి మాఫియాలను, పేకాట క్లబ్బులను నియంత్రించడంలో విఫలమై పులివెందుల వెళ్లి నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని, అక్కడి ప్రజలు వైఎస్సార్ సీపీకే పట్టం కడతారని స్వామిదాసు పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను ఖూనీ చేస్తూ అక్రమంగా గెలుపునకు టీడీపీ చేస్తున్న ప్రయత్నాలను వైఎస్సార్ సీపీ ధైర్యంగా ఎదుర్కొంటోందని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు నరెడ్ల వీరారెడ్డి, లీగల్ సెల్ కన్వీనర్ రేగళ్ల మోహనరెడ్డి, తిరువూరు జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల, పట్టణ అధ్యక్షులు తాళ్లూరి నవీన్‌కుమార్, చలమాల సత్యనారాయణ, 15వ వార్డు కౌన్సిలర్ మోదుగు ప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్వామిదాసు, పక్కన పార్టీ నాయకులు

మైలవరం ఎంఈఓ-1గా రాజు

మైలవరం: మైలవరం మండల విద్యాశాఖాధికారి-1గా బండి రాజు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా అప్స డెమొక్రటిక్ రాష్ట్ర అధ్యక్షుడు గొల్లపూడి మోహనరావు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, మైలవరం డివిజన్ సెక్రటరీ సురేష్, లక్ష్మీ, అనూరాధ, చక్రధరరావులు బుధవారం ఆయనను కలిసి శాలువాతో సత్కరించారు.

ఇబ్రహీంపట్నం ఎంఈఓ-2గా మాలిని..

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ఎంఈఓ-2గా కొటికలపూడి జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయిని టీవీ మాలిని నియమితులయ్యారు. గురువారం ఎంఈఓ కార్యాలయంలో ఆమె బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంఈఓ సీహెచ్ పుష్పలత, పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆమెకు అభినందనలు తెలిపారు.

వేధిస్తున్న అధికారుల కొరత

సకాలంలో పనులు జరగక ప్రజల ఇబ్బందులు

చాట్రాయి: మండల స్థాయిలో ప్రభుత్వ వ్యవస్థను నడిపే మండల స్థాయి అధికారుల కొరత ఏర్పడడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ డి. ప్రశాంతి సస్పెండ్ అయిన నాటి నుంచి ఇప్పటివరకు ఇన్‌చార్జీలను నియమించడంతో ముఖ్యమైన పనులు అవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్, సూపరింటెండెంట్ పోస్టులు మూడు నెలల నుంచి భర్తీ చేయలేదు. ఎంపీడీఓ పోస్టుని ఇన్‌చార్జీలే నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఇన్‌చార్జి ఎంపీడీఓ విజయలక్ష్మి మెడికల్ లీవు పెట్టటడంతో ఆ పోస్టు కూడా ఖాళీగానే ఉంది. ఆగిరిపల్లి ఈఓపీఆర్‌డీని ఇన్‌చార్జిగా నియమించినప్పటికి ఇంకా జాయిన్ కాలేదు. హౌసింగ్ ఏఈ పోస్టు రెండేళ్లుగా ఖాళీగా ఉన్నా ఇప్పటి వరకు ఏఈ పోస్టుని భర్తీ చేయలేదు. ఈ విధంగా మండల స్థాయి అధికారుల కొరత ఏర్పడటంతో ఇన్‌చార్జీలతో కాలం నెట్టుకు వస్తున్నారు. దీంతో ముఖ్యమైన పనులు కావడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఖాళీగా ఉన్న మండల స్థాయి అధికారుల పోస్టులను భర్తీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.



మండల పరిషత్ కార్యాలయం

తల్లిపాలతో బిడ్డకు ఆరోగ్యం

చాట్రాయి: పుట్టిన బిడ్డకు గంటలోపు ముర్రు పాలు పట్టించడం చాలా మంచిదని నూజివీడు ఐసీడీఎస్ సీడీపీఓ పి. విజయకుమారి అన్నారు. ఆరుగొలనుపేట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవ ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. సూపర్‌వైజర్లు గాయత్రీదేవి, కమలాబాయమ్మ, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం..

నూజివీడు: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని, అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె. ధనలక్ష్మి అన్నారు. పట్టణంలోని అజరయ్యపేట అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. అంగన్‌వాడీ వర్కర్లు, ఆశావర్కర్లు తమ పరిధిలోని గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు నిత్యం తల్లిపాల ప్రాధాన్యతను వివరించాలని ఆమె సూచించారు.

- ముసునూరు: తల్లి పాలను మించిన పోషకాహారం లేదని, తల్లిపాలే బిడ్డకు శ్రేష్ఠమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి అన్నారు. ప్రపంచ తల్లి పాల వారోత్సవాల ముగింపు సందర్భంగా గురువారం కాట్రేనిపాడు, చింతలవల్లి అంగన్‌వాడీ కేంద్రాల వద్ద తల్లిపాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. తల్లీ బిడ్డల ఆరోగ్య పరిరక్షణ కోసం అంగన్‌వాడీల ద్వారా అందుతున్న పోషకాహారాన్ని స్వీకరించాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల సేవలను గర్భిణులు, బాలింతలు, చిన్నారులు వినియోగించుకోవాలన్నారు. ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.



ఆరుగొలనుపేటలో మాట్లాడుతున్న సీడీపీఓ విజయకుమారి


అవగాహన ర్యాలీ

ఆగిరిపల్లి: తల్లిపాలు శిశువులకు రోగ నిరోధక శక్తి పెంచడంతో పాటు ఆరోగ్యానికి దోహదం చేస్తాయని ఐసీడీఎస్ సూపర్ వైజర్ రాగమయి అన్నారు. గురువారం ఈదరలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, తల్లులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి

ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి

నూజివీడు: అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్ సరఫరాకు అధిక ప్రాధాన్యతనిచ్చి సిబ్బంది పని చేయాలని ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి. పుల్లారెడ్డి పేర్కొన్నారు. ఏపీసీపీడీసీఎల్ పరిధిలోని నూజివీడు డివిజన్ పనితీరుపై గురువారం నూజివీడులో సీఎండీ సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు సంబంధించిన వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరులో గాని, పనిని పూర్తిచేయడంలో గాని జాప్యం చేయవద్దన్నారు. మండల స్థాయిలో విద్యుత్ సరఫరాపై ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా ఆ అధికారికి వచ్చిన రేటింగ్‌ననుసరించి క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైనా 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ అవసరం ఉంటే ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. డైరెక్టర్ ఎ. మురళీకృష్ణ యాదవ్, నూజివీడు ఈఈ ఎ. సత్యనారాయణ, ఈఈ టెక్నికల్ టి. హనుమయ్య, ఈఈ ఎమ్మార్టీ వై. కొండలరావు, ఈఈ కన్‌స్ట్రక్షన్స్ ఆర్. రవికిశోర్, డీఈలు పోతురాజు, వీరబాబు, రామకృష్ణ, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న సీఎండీ పుల్లారెడ్డి

కార్నియాల సేకరణ

తిరువూరు: తిరువూరులో బుధవారం మృతిచెందిన సీపీఎం సీనియర్ కార్యకర్త మాచిబోయిన లక్ష్మీనారాయణ (92) నేత్రాలను ఆయన కుటుంబ సభ్యులు దానమిచ్చారు. విజయవాడ ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వైద్య నిపుణులు లక్ష్మీనారాయణ కార్నియాలను గురువారం సేకరించారు. లయన్స్ క్లబ్ సభ్యులు రాజేష్‌ఖన్నా, శంకరరావు, నరసింహారావు పాల్గొన్నారు. అనంతరం లక్ష్మీనారాయణ అంతిమయాత్ర జరిగింది.

మూడు రోజులు వరుసగా సెలవులు

ఇంటిబాట పట్టిన ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు

నూజివీడు: ఈనెల 8వ తేదీ నుంచి వరుసగా మూడు రోజులు సెలవులు రావడం, వచ్చే వారంలో కూడా 15, 16, 17 తేదీల్లో వరుసగా సెలవులు ఉండటంతో ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ఇంటిబాట పట్టారు. ముఖ్యంగా నూజివీడు క్యాంపస్‌లో ఉన్న నూజివీడు, శ్రీకాకుళం, ఒంగోలు ట్రిపుల్ ఐటీలకు చెందిన పీయూసీ ప్రథమ సంవత్సరం విద్యార్థులు ఇళ్లకు వెళ్తున్నారు. వీరిని తీసుకువెళ్లేందుకు వారి తల్లిదండ్రులు రావడంతో ట్రిపుల్ ఐటీ మెయిన్ గేట్ వద్ద కోలాహలం కనిపించింది. సెక్యూరిటీ సిబ్బంది తల్లిదండ్రుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతే వారితో సంతకాలు చేయించుకొని విద్యార్థులను అప్పగిస్తున్నారు. గురువారం ఒక్క రోజే దాదాపు 1,500 మందికి పైగా విద్యార్థులు ఇంటిబాట పట్టారు.

జాకీర్ హుస్సేన్ కళాశాలలో వరలక్ష్మీ వ్రతం

ఇబ్రహీంపట్నం: జాకీర్ హుస్సేన్ కళాశాలలో ముందస్తు వరలక్ష్మీ వ్రతం కార్యక్రమం గురువారం నిర్వహించారు. గణపతి పూజతో మొదలుపెట్టి లక్ష్మీ అష్టోత్తర పూజతో ముగించారు. వరలక్ష్మీ దేవికి పండ్లు, పూలు, నైవేద్యం, హారతి సమర్పించారు. డిగ్రీ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్స్ మస్తాన్‌వలి, సాధిక్ మాట్లాడుతూ తమ విద్యార్థులకు మంచి విద్యాబుద్ధులతో పాటు ఉన్నతమైన భవిష్యత్ ఇవ్వాలని ఈ కార్యక్రమం నిర్వహించామని చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి

ఎంపీడీఓ చెన్నా రాఘవేంద్రనాథ్

నూజివీడు: మండలంలోని గ్రామ సచివాలయ సిబ్బంది అందరూ సమన్వయంతో పనిచేసి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీఓ చెన్నా రాఘవేంద్రనాథ్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం పలు గ్రామ సచివాలయాల సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రెవెన్యూ, వ్యవసాయ, సర్వే, మహిళా సంరక్షణ కార్యదర్శులు తదితర శాఖలకు చెందిన వారు ఒకరికొకరు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. అందరూ కలిసి పనిచేస్తేనే మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. ముఖ్యంగా మండలంలోని గిరిజన గ్రామాల్లోని ప్రజలు బాగా వెనుకబడి ఉన్నారని, వారి అభివృద్ధికి గ్రామ సచివాలయ సిబ్బంది కృషి చేయాలన్నారు. చదువుకోవడం వల్ల కలిగే లాభాలు, చదువుకున్న యువత ఖాళీగా ఉండకుండా అభివృద్ధి పథంలో ఎలా నడవాలనే విషయాలపై వారికి అవగాహన కల్పించి తద్వారా వారిని అభివృద్ధి వైపు పయనించేలా చేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో అన్ని విషయాలు తెలుసుకునేది గ్రామ సచివాలయ సిబ్బందే కాబట్టి గ్రామాల అభివృద్ధికి, గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి చేయాల్సిన పనులు తదితర వివరాలను ఎప్పటికప్పుడు తెలియజేస్తూ ఉండాలన్నారు. సమావేశంలో పలు గ్రామ సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

పిడుగుపాటుకు కళాశాల పిట్టగోడ పాక్షికంగా ధ్వంసం

మైలవరం: మైలవరంలో డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనం పిట్టగోడ పిడుగుపాటుకు స్వల్పంగా దెబ్బతింది. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరుగలేదు. గురువారం మధ్యాహ్నం ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఆ సమయంలోనే పిడుగుపడి కళాశాల పిట్టగోడ దెబ్బతింది. వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి. వాహన చోదకులు ఇబ్బందులకు గురయ్యారు.

చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

ముసునూరు: చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి అందరూ చేయూతనివ్వాలని జాతీయ చేనేత ఐక్య వేదిక సంఘం నూజివీడు నియోజకవర్గ అధ్యక్షుడు మల్లవల్లి కోటేశ్వరరావు కోరారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా గురువారం నూజివీడు నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల నేతన్నలను కలిసి, సమస్యలు తెలుసుకునే కార్యక్రమానికి చెక్కపల్లి నుంచి శ్రీకారం చుట్టారు. సమస్యల పరిష్కారం కోసం ఉన్నతాధికారులకు త్వరలో వినతిపత్రాలు అందజేయనున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో లోపూడి, చెక్కపల్లికి చెందిన నేత కార్మికులు కల్కిమూర్తి, శోభనం, భావనారుషి, మన్మథరావు, మార్కండేయులు, లక్ష్మీనారాయణ, శ్రీధర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.